క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండలంలోని జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసియున్న శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

వెంకటేశ్వరస్వామికి..

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునుండి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆంజనేయ స్వామికి..

సిద్దవటం : మండలంలోని కమ్మపాలెం గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి శనివారానికి మండలం రోజులు కావడంతో స్వామివారికి అభిషేకం, అలంకరణ, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

గురుపౌర్ణమికి ప్రభుత్వవిప్ కొరముట్లకు ఆహ్వానం



కొరముట్లకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దేవాలయ కమిటీ అధ్యక్షుడు

రైల్వేకోడూరు : పట్టణంలోని సాయిబాబా గుడిలో గురుపౌర్ణమి సందర్భంగా జరగబోయే కార్యక్రమాలకు హాజరవ్వాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులకు శనివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సాయిబాబా గుడి అధ్యక్షులు పరిటాల జగన్నాదం, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గునిశెట్టి రమేష్ ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మేడా వెంకటసుబ్బయ్య, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

బీరువా వితరణ

నందలూరు (రాజంపేట) : నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రియాంక నర్సింగ్ కళాశాల ప్రతినిధి అనిల్ బీరువాను వితరణ చేశారు. ఈ బీరువా తాళాలను మండల వైద్యాధికారిణి సృజనకు అందచేశారు. మండల వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్‌సభ్యుల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. రామాపురం మండలంకు చెందిన రామచంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుల ఆర్థిక సౌజన్యంతో అన్నం పొట్లాలను క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో పేదలకు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, క్యాంపు దాతలు పవన్‌కుమార్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, సభ్యుడు నందినీ ట్రావెల్స్ వినోధ్ కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె, మిట్టపల్లె, శివునిపల్లె, మాధవరం-1, ముమ్మడిగుంటపల్లె, మోదీన్‌సాబ్‌పల్లె, బంగారుపేట, పార్వతిపురం, వెంకటేశ్వరాపురం, గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశానని ఎంఈఓ-2 ఆవుల అరుణ తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం మెనూ రిజిస్టర్, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు తనిఖీ చేశారు.

రికార్డుల పరిశీలన

సిద్దవటం : సిద్దవటం ఎగువపేట లోని ఎంపీపీ స్కూల్‌ను శనివారం ఎంఈఓ శంకరయ్య తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, మెనూ రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఎగువపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల హాజరును. స్టోర్ రూమ్, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు.

పట్టుదలతో చదవాలి

రాయచోటి టౌన్ : కృషి, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష విద్యార్థులకు సూచించారు. శనివారం రాయచోటి మాసాపేట పరిధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఆ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. వీటిలో పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, రంగు పెన్సిళ్లు, రబ్బర్లు, నెట్ పుస్తకాలు వంటివి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూర్ అహమ్మద్, నీలాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే మంచి దిగుబడులు

గాలివీడు : మామిడి పంట కోత తరువాత సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యాన వనశాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అరవీడు, గోరాన్‌చెరువు గ్రామాల్లో మామిడి పంటలో కాయల కోత అనంతరం ఆచరించాల్సిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు పొంట పొలాల్లో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సలహా మండలి అధ్యక్షులు గడ్డం రెడ్డప్పరెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది బాబు, మల్లునాయక్, రెడ్డిమల్లిక, తిరుమల రాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అధికారులు బాధ్యతతో పనిచేయాలి

ఒంటిమిట్ట : ప్రభుత్వం అర్హులై ఉండి పథకాలు అందని వారిని గుర్తించి వారికి పథకాలు అందించే అవకాశం జులై 1 నుంచి జగనన్న సురక్షతో కల్పించబోతోందని, ఈ మహత్తరమైన కార్యక్రమంపై మండల అధికారులు బాధ్యతతో పనిచేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మేడా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు శాఖా పరమైన సమస్యలను వివరించారు. వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే మేడా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న సురక్షకు సంబంధించి ఉచితంగా అందిస్తున్న ధృవ పత్రాలపై ప్రజల్లో వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించి, వారికి ఏ ధృవపత్రం అవసరమవుతుందో దానిని ఉచితంగా అందించాలన్నారు. కొండ మాచుపల్లిలో గల తాగు నీటి సమస్యను పరిష్కరించాలని, ఒంటిమిట్టలోగల డ్రైనేజీ సమస్యపై తొందర్లోనే పరిష్కారం చూపుతామని, వెలుగులో జరుగుతున్న అక్రమాలను అరికడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ రఫీ, ఎంపీటీసీలు ముమ్మడి నారాయణరెడ్డి, పిడుగు వెంకటలక్షుమ్మ, టక్కోలు లక్ష్మీప్రసన్న, బాషా, సర్పంచులు కత్తి సుజాత, స్వర్ణలత, మేరువ శివనారాయణ, పన్నెల రామలక్షుమ్మ, బాదుల్లా, ఎంపీడీవో రెడ్డయ్య, తహసీల్దార్ మాధవీలత, ఈవోపీఆర్‌డీ రంగయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.



ఒంటిమిట్ట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సంబేపల్లె: జగనన్న సురక్షపై వివరిస్తున్న ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి



చిన్నంపల్లెలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న సాయికిషోర్ రెడ్డి

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోండి

ఓబులవారిపల్లె : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నంపల్లె పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, ఎంపీడీఓ విజయారావు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, ఆర్‌ఐ రామ్మోహన్ నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గజపతి, సుకుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంబేపల్లె : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వాలంటీర్లకు జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకట రమణా రెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, సర్పంచ్ రామచంద్ర, నాయకులు వి.వి ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసుదేవ రెడ్డి, ఈఓపీఆర్‌డీ రవీంద్ర పాల్గొన్నారు.

పుల్లంపేట: ప్రభుత్వ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో ఇంటివద్దకే అధికారులు వెళ్లి సమస్యలు ఏమైనా ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తహశీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి సచివాలయంలోని కొమ్మనవారిపల్లి, దళవాయిపల్లి, కొత్తపల్లి గ్రామాలలో పర్యటించి 11 రకాల సేవలు ప్రజలు అందిస్తున్నామన్నారు.

రాజంపేట రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందాలని జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని తాళ్లపాక పంచాయతీలో శనివారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డితో కలిసి తహశీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి తాళ్లపాకలోని గడపగడపకు వెళ్లి నవరత్నాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీ శేఖర్‌రాజు, ఆర్‌ఐ కే.రాజేష్, వీఆర్‌ఓ బార్గవి పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్‌డీ ఆర్పీ పట్నాయక్ అన్నారు. శనివారం కోనంపేట గ్రామ సచివాలయం పరిధిలో వాలంటీర్లు ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమంకు సంబంధించి సర్వేను స్థానిక ఎంపీటీసీతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, కన్వీనర్ షౌకత్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కార్తీక్ రావు, సభాపతి, రెడ్డి బాష, ఖాదర్ వల్లి, జ్యోస్నా, షభానా, శ్రీలత పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆనందం

రాయచోటి : రాయచోటి రూరల్ మండలంలోని శిబ్యాల గ్రామంలో శనివారం ఉదయం 6 గంటలకే ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభించారు. శిబ్యాల కస్బా, రెడ్డివారిపల్లె, దళితవాడ, కుమ్మరపల్లె, అన్నంరాజుగారిపల్లె, మల్లయ్యగుంటపల్లె, గొర్లవాండ్లపల్లె, భోగ్యంపల్లెలలో ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. నాలుగేళ్ల జగన్ పాలనలో వివిధ పథకాల ద్వారా శిబ్యాల గ్రామంలోని 1870 కుటుంబాలకు కుల, మత వర్గం, రాజకీయాలకు అతీతంగా రూ.20 కోట్ల మేర లబ్ధి చేకూరడంపై ఇంటింటా ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి అభినందనలు

రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి గ్రామీణ యువత అభినందనలతో ముంచెత్తారు. జిల్లా ఏర్పాటుతో హోటల్స్, ఇతర వ్యాపార అభివృద్ధి, విద్యాసంస్థల ఏర్పాటు, పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఎంతో ఉపాధి అవకాశాలు



శిబ్యాల పరిధిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

లభిస్తున్నాయన్నారు. మీ కృషితో నియోజకవర్గంలో రానున్న రోజుల్లో కృష్ణా జలాల పారుదలతో వ్యవసాయం పండుగలా మారుతుందన్న ఆశాభావాన్ని యువత వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం మరువలేమని ఎమ్మెల్యే ఎదుట పాడి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

- శిబ్యాల కస్బాలో వైఎస్ఆర్ విగ్రహానికి శ్రీకాంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- కస్బాలోని ప్రాథమికోన్నత పాఠశాలను శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంఈఓ బాలాజీనాయక్‌కు ఎమ్మెల్యే సూచించారు.
- శిబ్యాల నుంచి రాయచోటి మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత మహిళలు కోరగా, తక్షణమే ఆర్టీసీ డీఎంకు ఫోన్ చేసి విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

దళితవాడలో ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు

జగన్ పాలనలో దళితులకు పెద్దపీట వేస్తున్నారని, అదే చంద్రబాబు పాలనలో దగాపడ్డామని ఇంటింటా ప్రజలు పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెనతో ఉన్నత విద్య చదువుతున్నామంటూ పలువురు విద్యార్థులు సంతోషంగా ఎమ్మెల్యే ఎదుట తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు.

కుమ్మరపల్లెలో.. బలహీనవర్గాలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని కుమ్మరపల్లెలోని తొగట, యాదవ కుటుంబాల ప్రజలు తెలిపారు.

అన్నంరాజుగారిపల్లెలో.. క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి క్షత్రియుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారంటూ ఇంటింటా క్షత్రియులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి సాదరంగా స్వాగతం పలికి ఆనందం వ్యక్తం చేశారు. ఈబీసీ నేస్తం ద్వారా తమకు ఆర్థికసాయం అందిందని మహిళలు తెలిపారు. గ్రామంలో రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డికి ఎమ్మెల్యే సూచించారు.

మల్లయ్యగుంటపల్లెలో..

- మల్లయ్యగుంటపల్లెలో 1.20 లక్షల నిధులతో తాగునీటి సౌకర్యాలను కల్పిస్తామని శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గొర్లవాండ్లపల్లె, భోగ్యంపల్లెలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.
- ఎమ్మెల్యే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 1120 గృహాలను సందర్శించారు.
- ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, బీసీ నేత పల్లపు రమేష్, ఎంపీడీఓ మల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, సర్పంచ్ బండి నాగమణి, ఎంపీటీసీ బోరెడ్డి నాగసుబ్బమ్మ, నారాయణరెడ్డి, డా.సత్యనారాయణరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రఘురామిరెడ్డి, నరసింహులు, నాగేశ్వరరావు, శంకరయ్య, జిల్లా బీసీ సెల్ విభాగం విజయభాస్కర్, మాజీ సర్పంచ్ హరి, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, దివాన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుల్లంపేట : పుల్లంపేటలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతులలోని ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, సోమవారం ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఎంఈఓగా వెంకటసుబ్బయ్య బాధ్యతలు చేపట్టారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యుడు నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బండపల్లి శ్రీనివాసులు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు హెచ్‌సీ శ్రీనివాసులు, కృష్ణమూర్తి నాయక్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం

రాయచోటి టౌన్ : శిబ్యాలలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. శిబ్యాలలో నూతనంగా నిర్మించిన ఈ భవనానికి ప్రభుత్వం నుంచి విడుదల అయిన నిధులను త్వరగా మంజూరు అయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. శారద, డాక్టర్ దివ్యవాణి పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి

రాజంపేట టౌన్ : అర్హులకు ప్రభుత్వ పథకాలు అందచేయాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని, వలంటీర్లు అర్హులకు పథకాలను అందచేయాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం వలంటీర్ల సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అందాల్సిన పథకాలు ఇంకా ఏవైనా ఉన్నాయా అని తెలుసుకోవాలన్నారు. నెలరోజుల పాటు ప్రభుత్వం సచివాలయాల్లో 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తుందని, ఈవిషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియచేసే బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. ఉచిత సేవలపై మున్సిపాలిటీ పరిధిలో క్యాంపులు కూడా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, జేసీఎస్ చైర్మన్ వడ్డే రమణ, కౌన్సిలర్లు న్యామతుల్లా, రాఘవేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి

గంగమ్మ భక్తుల కమిటీ అధ్యక్షుడిగా చిన్ననరసింహులు



రాజంపేట టౌన్ : బలిజపల్లె గంగమ్మ భక్తుల కమిటీ అధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధిలోని నారపురెడ్డిపల్లెకు చెందిన ఎర్రికొండు చిన్ననరసింహులు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఓ ప్రైవేట్ కార్యాలయంలో శనివారం పలువురు గంగమ్మ భక్తులు సమావేశమై చిన్న నరసింహులు యాదవ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గంగమ్మ జాతర నిర్వాహకులు అమ్మవారికి సమర్పించే సాంగ్యాల విషయంలో పంతాలకు పోయి వివాదాలు పడుతున్న కారణంగా జాతర చేసే పరిస్థితిలో లేరని తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని, మనోభావాలను దృష్టిలో ఉంచుకొని జాతర చేయాలన్న లక్ష్యంతో కమిటీ ఏర్పాటుకు అడుగులు వేశామన్నారు. కార్యవర్గం ఎంపిక పూర్తికాగానే జాతర నిర్వహణకు కృషి చేస్తామన్నారు. ఇదిలావుంటే రెండు వందల సంవత్సరాల గంగమ్మ జాతర చరిత్రలో జాతర నిర్వహణకు భక్తులు కమిటీగా ఏర్పడటం చారిత్రాత్మకమైన విషయమని చెప్పవచ్చు.

జాతర కోసం భక్తులు కమిటీగా ఏర్పాటు కానున్న విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజంపేట వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఏ నలుగురు కలిసినా ఇదే విషయాన్ని చర్చించుకున్నారు.

సినీ నటుడు అలీకి సన్మానం

రాజంపేట: సినీ నటుడు అలీ పెనగలూరుకు వచ్చిన సందర్భంగా రాజంపేట మైనార్టీ నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ గండికోట గుల్జార్ బాష ఆధ్వర్యంలో మైనార్టీ నేతలు అలీతో బేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంటు ఇగ్బాల్, ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంటు ఇనాయతుల్లా, మిడ్డేమీల్స్ యూనియన్ నేత ముజఫర్ అహ్మద్, జెడ్పీ స్కూల్ చైర్మన్ కరీమ్ తదితరులు పాల్గొన్నారు.



సినీ నటుడు అలీని ఘనంగా సన్మానించిన మైనార్టీ నేతలు

ప్రజలు అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ముద్దా బాబుల్ రెడ్డి

పుల్లంపేట: మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిట్వేలి సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు సర్వే నంబరు. 292లో ఆక్రమణకు గురైందని, చట్ట ప్రకారం ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. తొలగించని ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో రోడ్డు విస్తరణ, బస్టాండ్ అభివృద్ధి జరిగాయని, పుల్లంపేట మండలంలో రోడ్డు విస్తరణ చేపడుతుంటే కొంతమంది కుటిల ప్రయత్నాలు చేస్తూ అడ్డుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని, ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా రోడ్డు విస్తరణ, బస్టాండ్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. శంకర్ రెడ్డి, ఎం వెంకటరెడ్డి, బోగా పార్థసారథి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలలో వేగం పెంచాలి

రాయచోటి టౌన్ : ఇంటి నిర్మాణాల కార్యక్రమాన్ని స్పెషల్ డ్రైవ్ ద్వారా త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హౌసింగ్ పీడీ సాంబశివయ్య, డీఈ చంద్రశేఖర్‌లకు సూచించారు. శనివారం రాయచోటి నియోజక వర్గ పరిధిలో జగనన్న కాలనీలలో నిర్మితమవుతున్న ఇంటి నిర్మాణాలపై చర్చించారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి..

రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. గడగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాయ చోటి నియోజక వర్గ పరిధిలో పలు సబ్ స్టేషన్లను ప్రారంభించారు.

మానసిక ఉల్లాసాన్ని ఇవ్వాలి

రాజంపేట టౌన్ : తల్లిదండ్రులు పిల్లలకు మానసికంగా ఉల్లాసం కోసం వినోదాన్ని కూడా ఇవ్వాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని తిరుపతిరోడ్డులో ఏర్పాటు చేసిన మల్లిమల్లీ వసుంధర ఆక్వాసిటీ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను శనివారం ఎమ్మెల్యే మేడా .. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఆలోచన పెంచడమే లక్ష్యం

రాయచోటి: విద్యార్థులలో అన్వేషణాత్మక ఆలోచనలను పెంపొందింపచేసి వాటి ఆచరణకు అవకాశం కల్పించడమే అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రధాన లక్ష్యమని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం రాయచోటి ఆదర్శపాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందరర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు రకాల అన్వేషణాత్మక ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య పదాధికారుల ఎన్నిక

సంబేపల్లె : మండల కేంద్రం వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య పదాధికారుల ఎన్నిక నిర్వహించినట్లు వెలుగు పీడీ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ పర్యవేక్షణలో నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న సమాఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ ఎన్నికలో మండల అధ్యక్షురాలిగా కె. నందిని, సిద్ధమ్మ, కార్యదర్శిగా తస్లీం, కోఆర్డినేటర్ నాగరాజీలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిదంబరం రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసుదేవ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, వెలుగు ఏపీఎం సంజావరాజులు ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసుల రెడ్డి, వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీల పెంపు సరికాదు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి, ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్‌చార్జీలు తగ్గించాలన్న డిమాండ్‌పై శనివారం పట్టణంలోని ఎన్‌జీఓ హోం సభా భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ఈశ్వరయ్యతో పాటు కాంగ్రెస్‌నేత హఫీజుల్లా, లంబాడీ సంఘం జాతీయ నేత శంకర్ నాయక్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో యేటా కరెంటు చార్జీలు పెంచుతూ వస్తుండడం ప్రజలపై భారం మోపడమే అన్నారు. సీపీఐ నేతలు నరసింహులు, మహేష్, విశ్వ నాథనాయక్, సాంబశివ, కోటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం నేతలు మాట్లాడారు.

వంతాటిపల్లెలో పొలం బడి

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లెలో శనివారం వైఎస్ఆర్ పొలంబడి నిర్వహించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వరి నారుమళ్లలో మిడతలు ఆశించి నారును తింటున్నాయని, దీని నివారణకు క్లోరో పైరీపాస్ లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల చొప్పున నారు బాగా తడిసేలా పిచికారీ చేయాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రాయచోటి టౌన్ : బంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా డీటీవో డి. దినేష్ చంద్ర వాహనదారులను హెచ్చరించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల బస్సులు నిబంధనలకు అతిక్రమించి నడుపుతున్నారని చెప్పారు. అలాంటి వారిని ఉపేక్షించమన్నారు. బస్సుల్లో కెపాసిటీకి మించి ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. అలాగే కాలం చెల్లిన వాహనాలను నడపరాదని సూచించారు.

క్షయవ్యాధిని నియంత్రించవచ్చు

వీరబల్లె (రాయచోటి టౌన్): సకాలంలో మందులు వాడి మంచి పౌష్టికాహారం తీసుకొంటే క్షయవ్యాధిని నియంత్రించడంతో పాటు పూర్తిగా నయం చేసుకోవచ్చునని వీరబల్లె మండల వైద్య శాఖాధికారి డాక్టర్ వినయ్ బాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని వడ్డెపల్లెలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరస్వతి, ఏఎన్ఎం ప్రేమకుమారి పాల్గొన్నారు.

